4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 29 ఏప్రిల్ 2024
www.ntnews.com

# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

# రామాయణంలో స్త్రీ పాత్రల ఔచిత్యం

రామాయణ, భారత, భాగవతాలు భారతీయులకు పవిత్ర గ్రంథాలు. భారత సాహిత్యానికే అవి పట్టుకొమ్మలు. భారతీయ జీవన విధానానికి దర్పణాలు. మానవ జీవన విధాన రూపకల్పనకు చక్కగా ఉపకరించే సమున్నత సాధనాలు.

“ ఆదర్శ మానవ జీవితానికి దారిచూపే కరదీపిక రామాయణం. మూడు కుటుంబ జీవితాలను మన ముందుంచి, ఏది ఉత్తమ జీవితమో చెప్తూ, కుటుంబ బాంధవ్యాలను ఉదాహరణగా నిర్వచించి, ఎవరితో ఎలా మసలుకోవాలో సున్నితంగా సూచించే కావ్యం ఇది. అందుకే రామాయణానికి వైశిష్ట్యం కల్పించి, ఆరాధించారు.



డాక్టర్ శ్రీభాష్యం అనురాధ
87903 25502



**వాల్మీకి** రామాయణాన్ని ఆధారంగా చేసుకొని, ప్రాంతీయ భాషల్లో పలు రామాయణాలు వెలువడ్డాయి. తెలుగులో తొలి రామాయణం ‘భాస్కర రామాయణం’. ద్విపదగా, చంపూ పద్ధతిలో రూపొందిన మొదటి రామాయణం. అది జానపద ప్రభావం లేక ఇంచుమించు మూల రామాయణ కథ ఆధారంగానే సాగింది.

“ రామాయణాన్ని సాహిత్య చరిత్రలో కుటుంబ, సామాజిక ఆదర్శాల ద్వారా జీవితంలో విస్తృతమైన దృక్పథాన్ని ప్రవేశపెట్టిన మొదటి రచనలలో ఒకటిగా చెప్పవచ్చు. స్త్రీ పాత్రల గురించిన నిర్దిష్టమైన అధ్యయనంతో గుర్తించబడిన విలువలు లేదా ఆదర్శాలు ఏవీ చెప్పకుండా వదలలేదని చెప్పవచ్చు. మానవ ఆలోచనల భావోద్వేగం, ఉనికి సంపూర్ణతను ప్రదర్శిస్తుంది.

భారతదేశమే కాకుండా ప్రపంచంపై దాని ప్రభావాన్ని విస్తృతం చేస్తుంది. రామాయణమంతా సీత పాత్ర విస్తరిస్తుంది. ‘సీతాయః చరిత మహత్’ అనే వ్యక్తీకరణ దీనికి నిదర్శనం. కథాంశం మార్చడానికి (మంథర); కథాంశ మలుపు (కౌసల్య, సుమిత్ర, కైకేయి); అనుబంధించడం (శబరి, అహల్య); ఏకపక్ష పాత్ర (ఊర్మిళ); ఇలా మనకు ఎన్నో స్త్రీ పాత్రలు నిజ జీవితపు సారూప్యతను కనిపింపజేస్తాయి.

స్త్రీ పాత్రల ఔచిత్యం: భాస్కర రామాయణంలో మొదట అహల్య వృత్తాంతంలో ప్రత్యేకత కనిపిస్తుంది. ఇంద్రుడు అహల్యను మోసగించి గౌతముడు లేని సమయాన కోరి వస్తాడు. తన కూతతో పొద్దు పొడిచిన సంకేతం ఇచ్చాడు. గౌతముడు అనుష్ఠానాలు నిర్వర్తించుకోవడానికి వెళ్తాడు. ఆ సమయం చూసుకొని ఇంద్రుడు ఆశ్రమంలో ప్రవేశిస్తాడు. దివ్య దృష్టి కలిగిన గౌతముడు అన్ని తెలుసుకోవచ్చు కానీ, ‘బుద్ధారెడ్డి’ సామాన్య మానవుడి కల్పనలు కోడి కూతతో తెల్లవారిందని భ్రమపడే విధంగా చిత్రించాడు. తిరిగివచ్చిన గౌతముడు అహల్యను శపిస్తాడు. రంగనాథ రామాయణంలో ‘పడతి పాషాణమై పడి యుండు నీవు’ అని శపించినట్లు ఉన్నది.

**‘మంథర’:** ఈ పాత్రను బుద్ధారెడ్డి రాముడు చిన్నప్పుడు తన కాలు విరిచినందుకు ప్రతీకారం తీర్చుకునే స్వభావం కలదిగా చిత్రిస్తాడు. యజ్ఞదత్తుడు మరణించినప్పుడు అతని తండ్రితో పాటు తల్లికూడా ఎంతగానో విలపించిందని చెప్పడంలో ఆ పాత్రలో మాతృహృదయాన్ని వ్యక్తపరిచాడు.

**ఊర్మిళ:** రంగనాథ రామాయణంలో ఊర్మిళాదేవి నిద్ర ఘట్టాన్ని వివరిస్తాడు. అరణ్యవాసానికి వెళ్లిన తన భర్త (రాముని వెంట లక్ష్మణుడు) వెళ్లినప్పుడు, లక్ష్మణ కర్తవ్య నిర్వహణ కోసం నిద్రాదేవి తనను ఆవహించడం, లక్ష్మణుడు తిరిగి రాగానే, నిద్రాదేవి వెళ్లిపోవడం దీనిలో చెప్పబడింది.

**సీత:** సీతాదేవిని హిందూ మతంలోనే విశ్వాసాల ప్రతీకగా చూపబడింది. విష్ణువు అవతారమైన శ్రీరాముని ధర్మపత్ని హిందూ సమాజంలో స్త్రీ ప్రవర్తనకు, ఆలోచనకు సీతా చరిత్ర మార్గదర్శకంగా నిలిచిపోయింది. సకల గుణాలు కలిగిన సాధ్విగా, భారతీయులకు నిత్యం ఆరాధించే సుగుణాల రాశిగా పేరొందింది. రామాయణ కథంతా సీతే ప్రధాన పాత్ర వహించింది.

“ **అంజన:** కిష్కింధ నివాసి, కుంజరుడి కూతురు, కేసరి భార్య అంజన. ఈమెకు వాయుదేవుడి అంశతో హనుమంతుడు జన్మించాడు. రామాయణంలో ఈమె ప్రధాన పాత్ర వహించింది.

**అనసూయ:** అంటే అసూయ లేనిదని అర్థం. కర్దమ ప్రజాపతి, దేవహూతుల పుత్రిక, అత్రి మహర్షి భార్య. వినయ, వివేకాలు ఈమెకు సహజ భూషణాలు. పతి సేవలో లీనమై ఉన్నట్టు పతి భక్తికి మెచ్చి అత్రి మహర్షి అష్టాక్షరీ మంత్రోపదేశం చేస్తాడు. మహర్షులకు కూడా పూజ్యనీయమైన మహోన్నత స్థానాన్ని పొందింది.

**అరుంధతి:** వశిష్ఠ మహర్షి ధర్మపత్ని మహా పతివ్రత. బాలకాండలో ఈమె గురించి చెప్పబడింది.

**కైకసి:** సుమాలి, కేతుమతిల కుమార్తె. విశ్రవసుని భార్య. రావణ, కుంభకర్ణ, విభీషణ, శూర్పణకలకు తల్లి. గొప్ప శివభక్తురాలుగా చిత్రించారు.

**కైకేయి:** రామాయణంలో దశరథుని మూడో భార్య. పుత్రకామేష్టి యాగం చేసిన తర్వాత యజ్ఞ ఫలం మూలంగా ఈమెకు భరతుడు జన్మిస్తాడు. తన దాసి అయిన మంథర మాట విని, శ్రీరాముడిని 14 ఏండ్లు వన వాసానికి పంపమని, భరతునికి రాజ్యాభిషేకం జరిపించమని దశరథుని కోరుకుంటుంది. సీతారాముల వనవాసానికి ప్రధాన కారకురాలైంది.

**కౌసల్య:** అయోధ్య రాజ్యానికి మహారాణి. కోసల రాకుమారి. ఈమె శ్రీరాముని తల్లి. మహా విష్ణువునే పుత్రునిగా పొందే అదృష్టం పొందింది. ‘కౌసల్యా సుప్రజా రామా’ అని కీర్తించబడింది.

**సుమిత్ర:** కాశీరాజ్యపు రాకుమారి. యజ్ఞ ఫలం మూలంగా లక్ష్మణుడు, శత్రుఘ్నుడు జన్మించారు. సౌమిత్రి అని లక్ష్మణునికి పేరు. రామాయణంలో సుమిత్ర పాత్ర చాలా కొంచెమే కనిపిస్తుంది.

**తాటకి:** యక్ష రాక్షసి. యక్షరాజైన సుకేతుడికి తపస్సు ఫలితంగా జన్మించిన పుత్రిక. విశ్వామిత్రుని యాగరక్షణార్థం వచ్చిన రామ లక్ష్మణులచే వధించబడింది.

**తార:** కిష్కింధకాండలో వాలి భార్యగా చిత్రింపబడుతుంది. అంగదుడు వీరి కుమారుడు. వాలి, సుగ్రీవుల వైరంలో తా ర హితోక్తులు ముఖ్యంగా చెప్పుకోదగినవి.

**త్రిజట:** ఇదొక కల్పిత పాత్ర. రావణుడు సీతను ఎత్తుకొని పోయి, లంకలో బంధించినప్పుడు, ఆమెకు రక్షణగా ఉంచిన రాక్షస స్త్రీల లో ఒకతె. ఈమె తన స్వప్న వృత్తాంతం సీతకు తెలపడం ముఖ్యాంశంగా చెప్పవచ్చు.

**మండోదరి:** రామాయణంలో రావణుని భార్య. విశ్వకర్మ పుత్రుడైన మయబ్రహ్మ కుమార్తె. ఇంద్రజిత్తు ఈమె కుమారుడు. రావణుని పట్టమహిషి. బాహ్య సౌందర్య రాశి మాత్రమే కాదు, అంతః సౌందర్యం మిక్కిలి కొనియాడదగినది. నీతిని, ధర్మాన్ని, కర్తవ్యాన్ని ప్రబోధం చేయగల మనస్తత్వం కలది. మండోదరి, అహల్య, తార, సీత, ద్రౌపది పంచ కన్యలుగా ప్రసిద్ధి చెందారు.

“ **శబరి:** శ్రీరాముని భక్తురాలు. రాముని దర్శనానికై జీవితాంతం భక్తితో వేచి ఉండి, చివరికి రామదర్శనం పొందిన ధన్యజీవి. గిరిజన స్త్రీ అయిన శబరి వేదం తెలియనప్పటికీ యోగ సాధన చేసింది. జ్ఞానం మోక్షం, పొందడానికి అందరూ అర్హులని నిరూపించినదే ‘శబరి కథ’.

**శూర్పణఖ:** రావణబ్రహ్మ సోదరి. రాముని వనవాస కాలంలో రామునిపై మోజుపడి, లక్ష్మణునిచే ముక్కు చెవులు కోయించుకుంటుంది. రామ రావణ యుద్ధానికి ఈమె ఒక కారణమని చెప్తారు.

**సులోచన:** ఇంద్రజిత్తుని భార్య.

**శ్రుతకీర్తి:** కుశ ధ్వజుని కుమార్తె. శత్రుఘ్నుని భార్య.

**సరమ:** విభీషణుడి భార్య.

**శాంత:** దశరథుని మిత్రుడైన రామపాదుని కుమార్తె.

**లంకిణి:** లంకకు కాపలాగా ఉన్న రాక్షసి.

**ధాన్యమాలిని:** రావణుని రెండవ భార్య. అతికాయుని తల్లి.

ఇలా రామాయణంలో కొన్ని పాత్రలు మానవత్వాన్ని మరిచిపోయి ప్రవర్తిస్తే, మరికొన్ని పాత్రలు మానవత్వానికి ప్రతీకలైనాయి. ఇది మానవ ఆలోచన, భావోద్వేగం, ఉనికి సంపూర్ణతను ప్రదర్శిస్తుంది. సమాజంలో లేదా ఒక వర్గం వ్యక్తుల స్థితి ఆధారంగా కానీ మానవ స్వభావం ఆధారంగా ఎటువంటి పక్షపాత భావాలతో చిత్రించబడలేదు.

ఈ రామాయణ స్త్రీ పాత్రల ద్వారా మానవ స్వభావ పరిధిని ఒక సంగ్రహావలోకనం పొందడం జరుగుతుంది. ఏది తీసుకోవాలి లేదా తిరస్కరించాలనేది కథ ముందుకు సాగుతున్న కొద్ది సంఘటనల ఫలితాన్ని బట్టి అవగతమవుతుంది. రామాయణంలో చిత్రీకరించబడిన పాత్రలు ప్రస్తుత సమాజంలో ఒక సాధారణ స్త్రీ జీవితానికి ఒక సాధారణ స్థానాన్ని తెలుసుకునే అంశం గా ఆలోచిస్తే ఈ పాత్రలు భారతీయ నేపథ్యానికి దూరంగా లేవు. ఒకరి కుటుంబం, స్నేహితులతో పరస్పరం భాషించేటప్పుడు అది ప్రభావం చూపుతుంది. చుట్టూ ఉన్న సమాజంలో ఈ పాత్రలను ఒక దానితో ఒకటి పోల్చి అంచనా వేసినప్పుడు ఆధునిక మహిళల తప్పుల నుంచి నేర్చుకోవడమే కాకుండా సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోగలరు. రాక్షసులు, సన్యాసులు, దేవతల పాత్రలు కేవలం ఆనందానికి మూలం మాత్రమే కాదు, మానవ స్వభావాలలోని లోపాలు లేదా బలాల పెద్ద సంస్కరణల వర్ణనలుగా చూసినప్పుడు, కథ సందేశాత్మకంగా మారుతుంది. ఈ విధంగా ఒకే సమయంలో నేర్చుకోవడం, ఆనందించడం, సొంత జీవితంలో సాకారం చేసుకోవడం గమనిస్తాం. మన సనాతన సంస్కృతిని నాడు, నేడు రేపు ప్రతిబింబింపజేసి ప్రగతి బాటలు వేసేది రామాయణం అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ■



## ఆఖరి క్షణం

నలుపు కేవలం ఓ రంగు కాదు
అది ఘనీభవించిన దుఃఖం

తెలుపూ ఒట్టి రంగు కాదు
విచ్చుకుని వికసించిన సంతోష
పరిమళం

నిజానికి
సప్త వర్ణాలల్లో ఏ ఒక్కటీ
ఏదో ఒక రంగు మాత్రమే కాదు
ఒక్కో రంగూ ఒక్కో భాష మాట్లాడుతుంది
ఒక్కో భావాన్ని ప్రకటిస్తుంది

మనం
బతికే కోట్లాది క్షణాల్లో
ఏ క్షణమూ ఒంటరిది కాదు
బతుకు ఒక్క రంగునూ ప్రతిబింబించదు

ప్రతి క్షణం గతంలో
తాను గడిపేసిన క్షణాన్ని వెంటేసుకొని
రానున్న క్షణంలోకి దారితీస్తుంది

దారీ తెన్నూ ఏ భవిష్యత్తూ లేనిది
ఒక్క చివరి క్షణమే

ఎప్పుడొస్తుందో తెలీని ఆ ఆఖరి క్షణం
తాను నడిచొచ్చిన క్షణాల్ని
చూస్తూ ఏడవకుండా
నవ్వుతూ కొవ్వొత్తిలా ఆరిపోతే
మనిషి బతుక్కి అంతకంటే ఆనందమేముంది
నలుపు తెలుపుల పరమార్థమేముంది



వారాల ఆనంద్
94405 01281

## ఆహ్వానం

### ప్రకటన

తెలంగాణ చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యం మొదలైన అంశాలపై తెలంగాణ సారస్వత పరిషత్తు రూపొందించి ప్రచురిస్తున్న జిల్లా సమగ్ర స్వరూప గ్రంథాల పరంపరలో మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్ జిల్లాల సంపుటాలకు వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. 1.జిల్లా నైసర్గిక స్వరూపం, 2.జిల్లా ప్రాచీన ఆధునిక చరిత్ర, సంస్కృతి, 3.పురావస్తు కట్టడాలు, 4.సంగీత నృత్య నాటక చిత్రలేఖన శిల్ప కళల వికాసం, 5.పద్య, 6.గేయ, 7.వచన కవిత్వం, 8.కథ, 9.నవల, 10.విమర్శ, 11.అనువాదం, 12.పరిశోధన, 13.బాలసాహిత్యం, 14.పత్రికలు, 15.జానపద కళలు, 16.తెలంగాణ ఉద్యమంలో జిల్లా కవులు కళాకారుల పాత్ర, 17.విద్యారంగం, 18.పరిశ్రమలు 19.వ్యవసాయం, 20.సాగు, తాగునీటి పథకాలు, 21. పర్యాటక ప్రదేశాలు, 22.ప్రాచీన ఆలయాలు జాతరలు, 23.జానపద విజ్ఞానం 24.జిల్లాకు చెందిన సాహిత్య సాంస్కృతిక సంస్థలు, 25.ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, 26.పండితులు, కళాకారులు, 27.క్రీడారంగం.. ఈ అంశాలపైన వ్యాసాలకు ఆహ్వానం.ఆసక్తి ఉన్నవారు వెంటనే 9441046839 నెంబర్‌లో గానీ rsuryaprakashrao@gmail.com మెయిల్ ద్వారా గానీ సంప్రదించాలి.

- డాక్టర్ రాయారావు సూర్యప్రకాశరావు

జర్నలిస్టుల్లో కవులు తక్కువే. వార్తలు, కథనాల ఏరివేతలోనే వారి సమయం హరిస్తుంది. దొరికిన విశ్రాంతిలోనే తమ మదిలో కదిలే భావధార కోసం వచనాన్ని మరిచి పద్యంలోకి వెళ్లాలి. వేళాపాళా చూడని మనసు ఊరట కోసం నిద్రాకాలాన్ని చించి మరీ కవితలల్లాలి. అప్పుడే హద్దులు దాటి రాయలేని వార్తలు కవి వెంట ఇంటికొచ్చి ఆయన నిశ్వాసాల్లో కొత్త ఊపిరి పోసుకుంటాయి. వార్తకు యాజమాన్యం ఉంటుంది కానీ, కవితకు కవే యజమాని. ఇలా కవిత్వం బారిన పడిన పాత్రికేయుల్లో గార శ్రీరామమూర్తి ఒకరు.

## కవితాకాశంలో ‘నిజం’ పద ముద్రలు

**జీ**వితమే పాత్రికేయంగా గడిపిన శ్రీరామమూర్తి కవిగా ‘నిజం’ అవతారమెత్తారు. జీవన గమనంలో చుట్టుముట్టిన భిన్న నేపథ్యాల, పార్శ్వాల ఒత్తిళ్లకు, రాపిడికి ‘నిజం’గా కవిత్వం ఆయనకు ఒక రిలీఫ్. ఒక ముందడుగు. ఒక బాధ్యత. ఒక ఆయుధం కూడా. బతుకు ఎన్ని మలుపులు తిరిగినా, తెరువు ఎన్ని దారులు చూపినా తన కవిత్వపు జెండా రంగు, ఎత్తు, నిటారు ఏ మాత్రం మారనీయలేదు. కవిత్వంలో నాణ్యత ఎంత ముఖ్యమో నిబద్ధత అంతకన్నా ముఖ్యమని నమ్మిన కవి ఆయన. తన నమ్మికని నిలబెట్టే ధీర కవిత్వాన్ని, వెరుపులేని వ్యక్తీకరణను కలంలో నింపుకొన్న ‘నిజం’ నిజాన్ని నిక్కచ్చిగా ప్రకటించారు. అలా ఆయన ముద్రతో వచ్చిన మరో కవితా గుచ్ఛం ‘రంగు రంగుల సూర్యోదయాలు’.





చాలాసార్లు తన మనసులోకి వెళ్లిపోతారు. అయితే ఆయన అక్కడే ఆగకుండా తన భావజాలం పిలిచినట్టు వెనక్కి వచ్చి పాలకుల తీరును ఎండగడతారు. ‘నిజంగా అభివృద్ధి చేస్తే/ సంక్షేమం అక్కర్లేదు/ సంక్షేమమే నడిస్తే/ అభివృద్ధి అడ్రస్ ఉండదు’ అంటూ చురకలేస్తారు. అందుకే ఆయన కవిత్వం రంగు రంగుల సూర్యోదయమైంది.

కవిత్వాన్ని ఆయన ఎంత ఇష్టపడుతారో, అందులో నాణ్యతను అంతే కోరుకుంటారు. ‘కవిత్వమా! ఇంటింటి/ సుమానివై నువ్వెంత/ సులువో చెబుతావు/ నాణ్యత దగ్గర కొండెక్కి కూచుంటావు’ అంటూ నేటి కవిత్వంలోని పలుచదనాన్ని విమర్శిస్తూ ‘లోతు బావికే కాదు, భావానికీ అవసరమే/ దిగేవారు పైకి రాలేక/ గిల గిలా కొట్టుకోవాలి’ అని సూత్రీకరిస్తారు.

నిజంలో ఐదు వందలకు పైగా నాలుగు పాదాల కవితలున్నాయి. ‘రెండు పూల మధ్య ఖాళీని/ పరిమళం పూరిస్తుంది/ ఇద్దరు మనుషుల మధ్య బంధాన్ని/ మతం నరుకుతుంది, ‘తినే పచ్చిక కంటే/ నెమరు ఎంతో రుచి/ వర్తమానం కంటే/ గతం మధురం’ ఇలా సాగే ఈ కవితల్లో వర్తమాన సమాజపు అన్ని రూపాలను, పోకడలను ఎత్తి చూపారు. ‘అన్ని చక్రాలూ/ నడిస్తేనే రథం కదిలేది/ దేనికేది కృతజ్ఞతలు చెప్పుకో నక్కర్లేదు/ బాధ్యతే అసలైన బండి’ అని చెప్తూ మనుషుల్లో చీలికల్ని నిలదీశారు.

శ్రీరామమూర్తిపై కవిత్వానిదెప్పుడూ పై చెయ్యే. ఆయన మూడ్‌ని దట్టంగా ఆవరిస్తుంది. అందుకే ‘విత్తనాలక్కర్లేని మనసు పొలం/ ఎల్లకాలం పండే ఆలోచనల క్షేత్రం, నిద్రలోనూ మేల్కొనేదే కన్ను/ చూపు దుప్పటి కప్పుకొని పడుకుంటుంది’ అని తన కవిత్వ చేతనను చెప్పుకోగలిగారు. కవిత్వంతో ఆయనది యాభై ఏండ్ల అనుబంధం. ఆయనలో భావుకతకు కొదువే లేదు. ముదిమిలో అది మరింత చిగురులు వేస్తోంది. ‘తీగకు, గోటికి లేని తీపి/ మీటే రాగానికి పూస్తుంది ఎలా/ ఇదే నిజమయ్యే అపురూప కల’ అని

శ్రీరామమూర్తి ఆలోచనల్లో నవ్యత ఎప్పుడు కదలాడుతుంది. చెప్పే విషయంలోనైనా, చెప్పే విధానంలోనైనా తనకంటూ ఓ బాట ఉంది. అందుకే ‘అవే కిరణాలు మళ్లీ మళ్లీనా?/ అయితే అది ఉషోదయమెలా అవుతుంది?’ అని కొత్త ప్రశ్నలు వేస్తారు. సామాజిక విమర్శలో కవి కలం సదా సంసిద్ధమే. ‘కుక్క కరిస్తే మందు ఉంటుంది/ మతం కరిస్తే ఉండదు’, ‘మనువాడిన నాడే/ భవిత చూసుకోవలసింది/ బౌద్ధాన్ని విడనాడిన/ దుర్బుద్ధుల భారతం’ లాంటి కవితలు అందుకు సాక్ష్యం. చివరగా తానేంటో తెలిపేలా ‘నేను ప్రేక్షకుడనే కానీ/ వేదికుడను కాను/ నా మూలాలు కప్పిపెట్టి/ నటించలేను’ అంటారు. స్థూలంగా నిజం కవిత్వానికి ఆయన రాసిన ఈ కవితనే ఉదహరించవచ్చు.

అక్షరాల కూర్పుతో ఏర్పడ్డ వాక్యంలో రసాత్మకత ప్రధాన లక్షణం అంటారు. అయితే వాక్యం జనాత్మకం కూడా కావ్యమే అని ఈ కవి కొత్తగా చెప్పారు. ఎంత రస గుళికలైనా జనం ప్రమేయం లేని కళలకు ప్రయోజనం శూన్యమే అనే అర్థం ఇందులో గోచరిస్తున్నది. నిజం కవిత్వంలో రసాత్మకత ఉంది, జనాత్మకతా ఉంది. ■



బి.నర్సన్
94401 28169





## ట్రోలింగ్

ఆమె అంతరంగపు
భావాల మువ్వల సవ్వడి
నిశ్శబ్దపు సమాధయ్యింది
కలలు ఆశలు ఆటలు
అందులోనే దాచుకున్నాయి
ఆలోచనలు ఆదర్శాలు
అందులోనే
దోబూచులాడుతున్నాయి

ఆమె ఆధునికతపు
ఉద్వేగాల గాజుల
సందడి సాంప్రదాయ
నిశీధిలో నిర్జీవమయ్యింది
చుట్టూ హద్దులు
అలుముకున్నాయి
గుండె సంద్రంలో కన్నీటి
వర్షాన్ని ఆశ్రయిస్తున్నాయి

అంతరిక్ష శోధనలో
ఆమె రాకెట్‌లా దూసుకెళ్తుంది
చిరునవ్వు దరహాసంలో
ఆమె చుట్టూ ఎవ్వరికీ కనిపించని
అనంత శూన్యం
ఆవరించి ఉంది
కేరింగ్ లేని ఈ సమాజంలో
ట్రోలింగ్‌తో నిత్య
యుద్ధం చేస్తుంది
ఆమెకు ఎన్ని సమస్యలున్నా
‘అతడే’ ఆమెకు సమస్య అయినా
ఎందుకో ఆమె అడుగు
ఆపడం లేదు
స్వేచ్ఛగా ధైర్యంతో
ముందడుగే వేస్తుంది

(ఆడవారిపై జరిగే ట్రోలింగ్‌కు వ్యతిరేకంగా..)



ఫిజిక్స్ అరుణ్‌కుమార్
95947 49536

## వీలునామా..!



నేను చచ్చాక
లోకమేదో ఇప్పటికే అంతమవుతున్నట్టు
అనవసరపు కంఠశోకాలు,
పెడబొబ్బలు పెట్టకండి
నాకసలే అరుపులంటే చికాకు
లేని కీర్తిని ఆపాదించి కీర్తిని
మాత్రమే చెప్పకండి
నేనన్న నాలుగు మాటలేవన్న
మంచివనుకుంటే వాటిని
తలుచుకోండి చాలు

నా శవంపై పూలు గట్రా పెట్టకండి
ఎట్లాగూ నే చచ్చాను అనవసరంగా సుకుమారమైన
పూల ప్రాణం తీయడం నచ్చదు నాకు
వాటికవే రాలేదాక పూయనీయండి అదే నాకు
నివాళి

నేనెట్లాగు కొండెక్కిన దీపాన్నే
నా తలాపున దీపాన్నేమీ ముట్టించకండి
అనవసరంగా నూనెను వృథా చేయకండి
ఆ మాత్రపు నూనె దొరుకని తల్లులెందరో
కన్నపిల్లల ముందు పెట్టుకుని ఆకలితో కన్నీరు కారుస్తున్నారు

అగరుబత్తులు గట్రా వెలిగించకండి
బతికున్నపుడెట్లాగు నేను స్వచ్ఛమైన గాలిని పీల్చలేదు
నా శవాన్ని చూడ్డానికి వచ్చినవాళ్లు
అగరుబత్తుల పొగకు ఊపిరాడక ముక్కు మూసుకుంటే
నేను తట్టుకోలేను...
వారినైనా కాసింత హాయిగా గాలి పీల్చుకోనివ్వండి

భూమిపై ఇప్పటికే కాలుష్యం మితిమీరిపోయింది
అనవసరంగా డప్పులు డీజేలు పెట్టి, బాంబులు కాల్చి
సచ్చాక కూడా నన్ను భవిష్యత్తుతరాలు
నిందించుకునేలా చేయకండి
అయినా బాంబులంటే నాకు సచ్చేంత భయం
ప్రశాంతంగా నాతో ఉన్న జ్ఞాపకాలు నెమరేస్తూ నడవండి
మీ ఆరోగ్యాలకు కూడా మంచిది

నన్ను కాలబెట్టడమో, బొంద పెట్టడమో చేయకండి
ప్రయోగాలంటే పడి సచ్చేవాన్ని...
కనీసం సచ్చాక అయినా నా కుతి తీరనివ్వండి
నా శవమేమన్న పనికొస్తే ప్రయోగార్థులకివ్వండి
పుట్టినందుకు అందుకైనా పనికొచ్చానన్న తృప్తి
అయినా మిగులుద్ది నాకు

అట్టా వీలుకాకుంటే
నన్ను తొందరగా బూడిద
చెయ్యండి
అక్కడే రెండో మూడో చెట్లు
నాటండి
నా శవం ప్రకృతికి చేసిన
హానికి పరిహారంగా
అమ్మ కడుపు నుంచి ఏ ఆడంబరం లేకుండా
ఎట్లయితే బయటకొచ్చానో
అట్లాగే ఏ ఆడంబరం లేకుండానే
నేల తల్లి గర్భాన కలిసిపోనివ్వండి నన్ను

నా పోటువా చుట్టూ పండ్లు ఫలహారాలు పెట్టీ
మంది ముందు నన్ను తిండిబోతును చేయకండి
బతకడానికి నాలుగు మెతుకులు
కడుపులో పడితే చాలనుకునేవాన్ని
కాకపోతే...
ఆకలంటూ ఇంటిముందరికి ఎవరన్నా వస్తే...
లేదనకుండా ఏదుంటే అది పెట్టండి వాళ్లకు
వారి ఆకలిలో నన్ను చూసుకోండి

మిత్రులారా...
ఈర్ష్యాసూయలతో మకిలి మనుషులున్న సమాజంలో
నన్ను నన్నుగా అర్థం చేసుకున్న మీ సహచర్యమే
నన్నింతకాలం కాసింతైన హాయిగా జీవించేలా చేసింది
నాకున్న లోటేదైనా ఉందంటే... అది
నన్ను ప్రేమిస్తున్న వారితో, నేను ప్రేమిస్తున్న వారితో
ఇంకొన్ని రోజులు గడపలేకపోయాననే
నన్నెపుడన్న తలుసుకోవాలని మీకనిపిస్తే
ఆపదలో ఉన్నవారికి మీకు చేతనైనంత అండనివ్వండి
వారి ముఖం మీది నవ్వులలో నేను కనిపిస్తాను

మళ్లీ ఏ ఆలోచన నన్ను
అటకాయిస్తదోననే తొందర తొందరగా
నాకు నేనే ఈ వీలునామా ప్రశాంతంగా రాసుకున్న
బంధాలు బంధనాలు, కంపు కంపు నిబంధనల పేర
బతికినన్నాళ్లు ఎట్లాగూ నన్ను నా
ఆలోచనలతో బతుకనివ్వలేదు
కనీసం సావులోనైన నా ఆలోచనలతో
హాయిగా అంతర్ధానం అవుదామనే...



దిలీప్.వి
84640 30808